# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ఉగ్రవాదులకు బలమైన సమాధానం చెప్పాలన్నదే ఆపరేషన్ సిందూర్ లక్ష్యమని భారత త్రివిధ దళాల అధిపతులు స్పష్టం చేశారు.
- కాల్పులు విరమణ పరిణామాల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు అత్యున్నతస్థాయి సమావేశం నిర్వహించారు.
- ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- దక్షిణాఫ్రికా, శ్రీలంక, భారత్ మధ్య జరిగిన మహిళల ముక్కోణపు వన్డే సిరీస్‌లో విజేతగా భారత్ నిలిచింది.

==========================

బుద్ధ పూర్ణిమ సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ పౌరులకు అభినందనలు తెలిపారు. బుద్ధుడు అహింస, ప్రేమ దయలను ఈ ప్రపంచానికి అందించారని ఆమె పేర్కొన్నారు. బుద్ధుని సిద్ధాంతాలు సమానత్వం, సౌహార్దం సామాజిక న్యాయంగా ఆమె తెలిపారు. ప్రజలు బుద్ధ భగవానుని ఆలోచనల నుంచి స్ఫూర్తి పొందాలని రాష్ట్రపతి కోరారు.

==========================

భారత్, పాకిస్థాన్ ల మధ్య కాల్పుల విరమణ తర్వాత తొలిసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలోని తన నివాసంలో ఈ రోజు అత్యున్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, సహ త్రివిధ దళాధిపతులతో ప్రధానమంత్రి తాజా పరిణామాలపైన చర్చలు జరిపినట్లుగా అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ సమావేశంలో పాల్గొన్న జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ సరిహద్దులలో ప్రస్తుత పరిస్థితిని వివరించారు. కాల్పుల విరమణ అవగాహన అనంతర పరిస్థితులపై సమావేశంలో చర్చించారని అధికార వర్గాలు తెలిపాయి.

==========================

పహల్గాం దాడి తర్వాత ఉగ్రవాదులకు బలమైన సమాధానం చెప్పాలన్నదే ఆపరేషన్ సిందూర్ లక్ష్యమని భారత త్రివిధ దళాల అధిపతులు డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్, భారతీయ వైమానిక దళం డైరెక్టర్ జనరల్ ఎయిర్ మార్షల్ ఏకే భారతి, వైస్ అడ్మిరల్ ప్రమోద్ స్పష్టం చేశారు. కొద్ది సేపటి క్రితం ఢిల్లీలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ మాట్లాడుతూ.... దేశం సరిహద్దు అవతల ఉన్న ఉగ్రవాద శిబిరాలను కచ్చితమైన ఆధారాలతో గుర్తించి దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడులలో వంద మందికి పైగా  ఉగ్రవాదులు మరణించారని చెప్పారు. పౌరులపై దాడులకు పాకిస్థాన్ తగిన ప్రతిఫలం చెల్లించిందని డీజీఎంవో పేర్కొంటూ....

(వాయిస్ 32 సెకన్లు)

ఇదిలా ఉండగా, భారతీయ వైమానిక దళం డైరెక్టర్ జనరల్, ఎయిర్ మార్షల్ ఏకే భారతి మాట్లాడుతూ... పాకిస్థాన్ మన దేశంలోని పౌరుల మీద దాడులు చేశారని చెప్పారు. ఈ కారణంగానే తాము పాకిస్థాన్ మీద ప్రతి దాడులకు డిగాల్సి వచ్చిందని తెలియచేస్తూ..

(వాయిస్ 35 సెకన్లు)

==========================

ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో నిర్మించిన బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ ఫెసిలిటీని ఈ రోజు దృశ్య మాధ్యమం విధానం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆధునిక భారతదేశంలో ఉగ్రవాదం ఉనికి లేకుండా సమర్ధవంతమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదని,  దేశ రాజకీయ, సామాజిక, వ్యూహాత్మక శక్తికి చిహ్నమని పేర్కొన్నారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల మౌలిక వసతులను కూల్చివేసేందుకే భారత్ సేనలు ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించాయని రాజ్ నాథ్ సింగ్ పేర్కొంటూ....

(వాయిస్ 36 సెకెన్లు)

ఇదిలా ఉండగా, బ్రహ్మోస్ భారతదేశం రష్యా దేశాల అత్యున్నత రక్షణ సాంకేతికత సంగమంగా కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

==========================

కాల్పుల నిలుపుదల చేయాలన్న ఆలోచన భారతదేశం పాకిస్థాన్ ల మధ్య ఉద్రిక్తతలను తగ్గించడానికి దోహదపడుతుందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీయో గుటెర్రస్ పేర్కొన్నారు. ఈ నిర్ణయం ఇరు దేశాల పురోగతిని సూచిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. యునైటెడ్ కింగ్ డం విదేశాంగ మంత్రి డేవిడ్ లామీ స్పందిస్తూ.. ఇరు దేశాల కాల్పుల నిలుపుదల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. భారత్ పాకిస్థాన్ చూపించిన ఈ స్ఫూర్తి ప్రాంతీయ స్థాయిలో శాంతి భద్రతను పునరుద్ధరించడంలో సహాయపడతాయన్న ఆశాభావాన్ని సౌదీ అరేబియా విదేశాంగ మంత్రిత్వ శాఖ వ్యక్తం చేసింది.

==========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు రేపటి నుండి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 20 వరకు ఈ పరీక్షలు జరుగుతాయని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు తెలిపారు. ఉదయం ఇంటర్ మొదటి సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

==========================

దక్షిణాఫ్రికా, శ్రీలంక, భారత్ జట్ల మధ్య జరిగిన మహిళల ముక్కోణపు వన్డే సిరీస్‌లో విజేతగా భారత్ నిలిచింది. ఈరోజు కొలంబో వేదికగా జరిగిన ఈ సిరీస్ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీలంకపై భారత్ 97 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత్ నిర్దేశించిన 343 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక 48.2 ఓవర్లలో 245 పరుగులకే ఆలౌటైంది. భారత ఓపెనర్ స్మృతి మంధాన 116 పరుగులు చేయగా, బౌలర్లలో స్నేహ్ రాణా 4, అమన్‌జ్యోత్ 3 వికెట్లు తీశారు.

విరామం

==========================

సరిహద్దులలో దేశం కోసం పోరాడుతూ అసువులు బాసిన తెలుగు జవాన్ మురళీనాయక్ అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో ఈ రోజు నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాలో జరిగిన అంత్యక్రియలకు ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, ఎస్. సవిత సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ తదితరులు హాజరై మురళీనాయక్ కి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... మురళీనాయక్ కుటుంబానికి 50 లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున అందిస్తామని వెల్లడించారు. మురళీనాయక్ తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించినట్లుగా పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

ఇదిలా ఉండగా, మురళీనాయక్ త్యాగం ఎప్పటికీ స్ఫూర్తి రగిలిస్తూనే ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ద్వారా పేర్కొన్నారు.

==========================

జమ్ము, కశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంతాల ప్రజలు ప్రస్తుతానికి సురక్షిత శిబిరాలలోనే ఉండాలని ఆ రాష్ట్ర పోలీసు అధికారులు కీలక సూచనలు చేశారు. భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య దాడుల నేపథ్యంలో జమ్ము, కశ్మీర్‌లోని బారాముల్లా, బందిపోరా, కుప్వారా జిల్లాల్లోని సరిహద్దు రేఖకు సమీపంలో ఉన్న గ్రామాలకు చెందిన దాదాపు 1.25 లక్షల మందిని భద్రతా బలగాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. పాకిస్తాన్ డ్రోన్ దాడుల కారణంగా సరిహద్దు గ్రామాలలో చాలా ఫిరంగి గుళ్లు చెల్లాచెదురుగా పడిపోయాయని, వాటి వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగే ప్రమాదం పొంచి ఉందని పోలీసు అధికారులు తెలిపారు. బాంబు నిర్వీర్య బృందాలను ఆయా గ్రామాలకు పంపి ఆ ఫిరంగులను నిర్వీర్యం చేస్తామని వెల్లడించారు.

==========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టుకు రేపటి నుంచి నెల రోజుల పాటు వేసవి సెలవులు ప్రకటించారు. ఈనెల 12 నుంచి జూన్ 13వ తేదీ వరకు సెలవులను మంజూరు చేస్తూ.. రిజిస్ట్రార్ జనరల్ వైవీఎస్‌బీజీ పార్థసారథి ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 16న యధావిధిగా కోర్టు కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. కాగా వేసవి సెలవులలో అత్యవసర కేసుల విచారణకు గాను వెకేషన్ కోర్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. మొదటి దశలో ఈ నెల 15, 22, 29వ తేదీలలో, రెండవ దశలో జూన్ 5, 12వ తేదీలలో ఈ కోర్టుల ద్వారా విచారణలు జరుగనున్నాయని ఆయన వివరించారు.

==========================

దేశ పౌరుల భద్రతతో పాటు వ్యూహాత్మక ప్రయోజనాల కోసం పది అత్యంత కీలకమైన ఉపగ్రహాలు నిరంతరం నిఘా నేత్రాలుగా పని చేస్తున్నాయని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. త్రిపుర రాజధాని అగర్తలలో ఈ రోజు జరిగిన సెంట్రల్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ 5వ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ... ఇస్రో ఉపగ్రహాలు భద్రతాపరమైన అంశాలతో పాటు, వ్యవసాయం, టెలీ-ఎడ్యుకేషన్, టెలీ-మెడిసిన్, వాతావరణ అంచనాలు, విపత్తుల సమయంలో నష్ట నివారణ వంటి అనేక పౌర సేవల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు.

==========================

ఆపరేషన్ సిందూర్ భాగంగా తమకు అప్పగించిన లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేశామని భారత వాయుసేన (ఐఏఎఫ్) ఈ రోజు సామాజిక మాధ్యమం ద్వారా ప్రకటించింది. జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా అత్యంత కచ్చితత్వంతో వృత్తి నైపుణ్యంతో ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించామని వెల్లడించింది. ఈ ఆపరేషన్ కార్యకలాపాలు ఇంకా కొనసాగుతున్నందున తగిన సమయంలో సమగ్ర వివరాలు వెల్లడిస్తామని పేర్కొంది.

==========================

తెలంగాణ ఎప్‌సెట్ ఇంజనీరింగ్ అగ్రికల్చర్-ఫార్మసీ విభాగం ఫలితాలు ఈ రోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో విడుదల చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో ప్రథమ, తృతీయ ర్యాంకులను ఆంధ్రప్రదేశ్ కి  చెందిన విద్యార్థులు దక్కించుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడకు చెందిన పల్లా భరత్‌చంద్ర ప్రథమ ర్యాంకు సాధించగా, విజయనగరం జిల్లాకు చెందిన హేమసాయి సూర్యకార్తీక్ తృతీయ ర్యాంకును కైవసం చేసుకున్నారని అధికారులు తెలిపారు.

==========================

భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఢిల్లీ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే పలు విమాన సర్వీసులను ఈ రోజు రద్దు చేశారు. విమానాశ్రయంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. అదేవిధంగా దేశంలోని ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లోగల 32 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. ఈ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు మొత్తం 100 విమాన సర్వీసులు రద్దయ్యాయని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (DIAL) వర్గాలు వెల్లడించాయి. దేశీయ విమాన సర్వీసుల్లో 52 అవుట్ గోయింగ్ సర్వీసులు, 44 ఇన్ కమింగ్ సర్వీసులు రద్దయ్యాయని తెలిపాయి. అయితే ఢిల్లీ విమానాశ్రయ కార్యకలాపాలు సాధారణంగానే సాగుతున్నాయని పేర్కొన్నాయి.

==========================

జాతీయ భద్రతా పరిణామాలపై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ  కోరింది. ఈ మేరకు లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు  రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఈ రోజు లేఖ రాశారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, కాల్పుల విరమణ వంటి అంశాలపై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని ఆ లేఖలో కోరారు. ప్రస్తుతం దేశం ముందున్న సవాళ్లను ఎదుర్కోడానికి  సమిష్టిగా నిర్ణయం తీసుకోవడానికి ఈ ప్రత్యేక సమావేశాలు ఒక అవకాశంగా రాహుల్‌గాంధీ పేర్కొన్నారు.

==========================
==========================